క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు పాల్గొనాలని సూచించారు.

దివ్యాంగ పింఛన్ల పరిశీలన



బుర్రారెడ్డిపల్లెలో పక్షవాత రోగిని పరిశీలిస్తున్న వైద్యులు

దొర్నిపాడు: మండలంలో పక్షవాతంతో రూ.15వేలు పింఛన్ పొందుతున్న లబ్ధిదారులను వైద్యులు మోహన్‌నాయక్, రాజశేఖర్ స్వరూప్ సోమవారం పరిశీలించారు. క్రిష్టిపాడులో 6, బుర్రారెడ్డిపల్లెలో 2, దొర్నిపాడులో 2, కొండాపురం 1, డబ్ల్యూ కొత్తపల్లె 1, డబ్ల్యూ గోవిందిన్నెలో 1, చాకరాజువేముల గ్రామంలో ఇద్దరు లబ్ధిదారుల స్థితిగతులను పరిశీలించారు. దివ్యాంగ ధ్రువపత్రాలు, వైద్య రిపోర్టులు, భౌతికంగా ప్రస్తుతం పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం బయోమెట్రిక్ తీసుకున్నారు. వీరి వెంట ఎంపీడీఓ సావిత్రి, స్థానిక పీహెచ్‌సీ వైద్యులు హుసేన్, రుహుల్లాఖాన్, పంచాయతీ కార్యదర్శులు ఓబులేసు, నాగార్జున, వెల్ఫేర్ అసిస్టెంట్ గీతా, సీహెచ్ఓ విమలమ్మ ఉన్నారు.

సేంద్రియ పద్ధతులను అవలంభించాలి

గోస్పాడు: సేంద్రియ వ్యవసాయ విధానాన్ని అనుసరించి రసాయనాలకు స్వస్తి పలకాలని ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఆహార ఉత్పత్తులపై వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ అమానుల్లా, ఈఓఆర్‌డీ నాగఅనసూయ పాల్గొన్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు

ఉయ్యాలవాడ:మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు అనుబంధంగా ఉన్న వంట గది ఆక్రమణకు గురవుతోందని గ్రామానికి చెందిన వంగాల సుబ్బారెడ్డి తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు పాఠశాల ఆవరణలో ఉన్న వంటగదిని ఆక్రమించుకుని గొర్రెలను తోలి పరిసరాలను అపరిశుభ్రంగా చేస్తున్నాడని ఫిర్యాదు లో పేర్కొన్నారు. స్పందించిన ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేయాలి

నంద్యాల(అర్బన్): ఉర్దూ భాషా సులువైందని, భారతదేశంలో పుట్టిన ఉర్దూ భాషను అభివృద్ధి చేయాలని ఆల్‌మదద్ ఫౌండేషన్ చైర్మన్ ఆకుమల్ల రహీం కోరారు. స్థానిక చాంద్‌బాడలోని భారత్ పాఠశాలలో ఉర్దూ భాషా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ రాహేలమ్మ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. 12వ వార్డు కౌన్సిల్ తమీమ్, అబ్దుల్‌మజీద్ పాల్గొన్నారు.

జీతాలు అందక ఆందోళనలో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): 6వ తేదీ వచ్చినా ఉపాధ్యాయులకు జీతాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా జీతాల కోసం ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి నెల 1వ తేదీనే జీతాలు ఇస్తామని చెప్పి 6వ తేదీ వచ్చినా చెల్లించకపోయారని, ఇదేనా మాట నిలబెట్టుకోవడమంటే అంటూ కూటమి నాయకులను ప్రశ్నించారు. ఉపాధ్యాయులు రోడ్లు ఎక్కక ముందే జీతాలు చెల్లించాలని సూచించారు.

సీడు పత్తికి నిప్పు



అగ్ని ప్రమాదంలో దెబ్బతిన్న పత్తి

రుద్రవరం: మండల పరిధిలోని నర్సాపురం గ్రామంలో గుర్తు తెలియని దుండగులు సీడు పత్తికి నిప్పు పెట్టారు. సంజీవకుమార్ అనే రైతు తన పొలంలో సీడు క్రాసింగ్ పత్తి సాగు చేశాడు. క్వింటా దాదాపు రూ.65 వేల ప్రకారం కంపెనీతో ఒప్పందం చేసుకున్నాడు. పంట కాలం పూర్తి కావడంతో వచ్చిన దిగుబడిని గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం పక్కనే ఉన్న బయలు ప్రదేశంలో ఆరబెట్టాడు. ఒకటి రెండు రోజుల్లో పత్తిని కంపెనీకి అప్పగించాల్సి ఉంది. అయితే, సోమవారం గుర్తు తెలియని దుండగులు బీడి అంటించి పత్తిలో పడేశారు. దీంతో లోలోపలే పత్తి అంతా కాలి పొగలు వచ్చాయి. గమనించిన రైతు పరుగున వెళ్లి ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే దాదాపు 20క్వింటాళ్ల పత్తి దెబ్బతినిందని అతను కన్నీటి పర్యంతమయ్యాడు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. 16 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, రు. జీతం అడిగితే బడ్జెట్ లేదంటూ సాకులు చెబుతున్నారన్నారు. వేతనం లేక వారి కుటుంబాలు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 680 జీవో తీసుకొచ్చి నేటికి నాలుగు సంవత్సరాలు కావస్తున్నా నెలకు రూ.10వేల వేతనం అమలు కావడం లేదని వాపోయారు. బండ్లు రిపేరీ, డ్రస్సులు, మాస్కులు ఇవ్వడం లేదన్నారు. శివలింగం, స్వాములు, తిరుపతయ్య, చిన్నలింగస్వామి, ప్రభావతి, భారతి పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ నిధులు విడుదల చేయాలని ఇసుక హమాలీలకు ఇసుక రీచ్‌లోనే ఉపాధి పనులు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. వారు మాట్లాతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికు సమస్యలను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. సుదీర్ఘ పోరాటాలు చేస్తున్నా సంక్షేమ బోర్డును పునరుద్ధరించడం లేదన్నారు. కార్మకులకు సంక్షేమ పథకాలు అందకుండా 1214 మెమోను తీసుకొని రావడం బాధాకరమన్నారు. వెల్ఫేర్ బోర్డు నుంచి పక్కదారి పట్టిన రూ.1,281 కోట్లను తిరిగి వెల్ఫేర్ బోర్డుకు చెల్లించి కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. తిమ్మయ్య, మున్నా, కృష్ణ, గౌస్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

గెస్ట్ ఫ్యాకల్టీల జీతాలు పెంచాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అధ్యాపకులు

నంద్యాల(న్యూటౌన్): గెస్ట్ ఫ్యాకల్టీ (అతిథి అధ్యాపకుల)ల జీతాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్ట్ ఫ్యాకల్టీ జిల్లా నాయకులు వెంకటస్వామి, సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సమస్య పరిష్కరించాలని ఈనెల 7వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. పదేళ్లుగా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్లుగా పని చేస్తున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రూ.10వేల జీతం సరిపోవడం లేదన్నారు. వేతనాల పెంపు కోసం శాంతియుతంగా కలెక్టర్ కార్యాలయం ముందు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరసన దీక్షలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సర్వే వివరాలను యాప్‌లో నమోదు చేయండి

● జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి

చాగలమర్రి: ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు 2వ విడత ఎన్‌సీడీసీ సర్వే–3.0 చేసి వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని నంద్యాల జిల్లా ఎన్‌డీపీ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రి పీహెచ్‌సీలోని సమావేశ మందిరంలో 2వ విడత ఎన్‌సీడీసీ సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులందరికీ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్లకు చెప్పులు జారిపోవడం లాంటి లక్షణాలను గుర్తించాలని తెలిపారు. అనుమానిత లెప్రసీ కేసులను ప్రతి రోజు పీహెచ్‌సీకి పంపి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారిణి పి.అంజలి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ముత్యాలపాడు పీహెచ్‌సీ ఎంపీఈఓలు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



చాగలమర్రి పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్షిస్తున్న జగదీష్ చంద్రారెడ్డి

రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

నంద్యాల: పట్టణంలోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వివిధ అభివృద్ధి అంశాలపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రక్త నిల్వ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి ల్యాబ్, మెడికల్ పరికరాల కోసం కలెక్టరేట్ నుంచి రూ.15 లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల నిధులతో బ్లడ్ రిఫ్రిజిరేటర్స్ సెంట్రి ఫ్యూజ్, జీరో టీడీఏస్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు థైరాయిడ్ టెస్ట్ నిర్వహించేందుకు పరికరాల ఏర్పాటు చేస్తామన్నారు. జనన, మరణ ధ్రువ పత్రాల జారీకి సంబంధించి సచివాలయ సిబ్బందికి ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి పత్రాలు నిర్ణీత గడువులోగా సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఈ కేవైసీ పూర్తి చేసి కంప్యూటరీకరించేలా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఆత్మకూరు పట్టణంలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఉమామి తబ్లీగ్ ఇజ్‌తేమా కార్యక్రమానికి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించుకోవాలన్నారు. నూతన సంవత్సర సందర్భంగా జిల్లా అధికారుల నుంచి సేకరించిన స్టడీ మెటీరియల్‌ను జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న 22,500 మంది విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. గతేడాది పది ఉత్తీర్ణత శాతంలో 19వ స్థానంలో ఉన్నామని, వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

హౌసింగ్ బోర్డు స్థలాలకు భద్రత..

హౌసింగ్ బోర్డు కాలనీలోని నివాసితుల స్థలాల భద్రతకు భరోసా కల్పిస్తూ జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఉత్తర్వుల ప్రతులను పంపిణీ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ బోర్డులోని సర్వే నంబర్లు 2317, 2319, 2320, 2315, 2313లలోని 49.40 ఎకరాలలోని 537 ప్లాట్‌కు సంబంధించిన ప్లాట్లకు హౌసింగ్ బోర్డు నంబర్లు వేసుకొని ఆక్రమణదారులు విక్రయాలు జరిపారన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో ఉంచారన్నారు. వీటన్నింటిని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డీఓలు, మండల తహసీల్దార్ నుంచి రికార్డులు తెప్పించుకొని సమగ్ర విచారణ జరిపి నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ తదుపరి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించుకునేందుకు ఉత్తర్వులను జారీ చేస్తున్నట్లు చెప్పారు.

బడ్జెట్‌పై అవగాహన అవసరం

నంద్యాల(న్యూటౌన్): ప్రజలు డిపాజిట్ ఖాతాల గురించి తెలుసుకొని ఆర్థిక ప్రణాళిక, బడ్జెట్‌పై అవగాహన పెంపొందించుకోవాలని కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సుబోద్ బీవాస్వే అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ ఆఫీసులోని మెప్మా కార్యాలయంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్‌తోపాటు ఏపీజీబీ సీనియర్ మేనేజర్ రాజేశ్వరరెడ్డి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, పీడీ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజర్ అశోక్‌కుమార్ పాల్గొన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మహిళలందరూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన జీవన జ్యోతి నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కేవైసీ, నామినీ, తదితర వాటి గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్ అనిల్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో పొదుపు కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

అంతర పాఠశాలల క్రికెట్ టోర్నీ

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎన్‌జీఓ కాలనీలో నున్న శ్రీ గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఇంట్రా స్కూల్ గర్ల్స్ సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి తెలిపారు. దస్తగిరిరెడ్డి, నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షుడు వసుధా రాణి, వైస్ ప్రెసిడెంట్లు మాధవి, డైరెక్టర్ మౌలాలి రెడ్డి పోటీలను ప్రారంభించారు. అంతర్ పాఠశాలల బాలికలను 14 బృందాలుగా ఏర్పాటు చేసి పోటీలు చేపట్టారు. విజేతలకు మెమొంటో, గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను అందజేసి అభినందించారు. నంద్యాల జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ అసోసియేషన్ సెక్రటరీ నాగరాజు, భరత్‌రెడ్డి, ఓబులేసు, రాజేష్ పాల్గొన్నారు.



విజేతలకు మెడల్స్ అందజేసిన దృశ్యం

వ్యాపార లావాదేవీల్లో ఏపీజీబీ ప్రథమస్థానం

ఉయ్యాలవాడ : దేశంలోని గ్రామీణ బ్యాంకుల్లో వ్యాపార లావాదేవీల్లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రథమస్థానంలో ఉందని ఆ శాఖ జనరల్ మేనేజర్ గిరి అన్నారు. మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మించిన ఏపీజీబీ శాఖ భవనాన్ని రీజనల్ మేనేజర్ పీవీ రమణతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఖాతాదారుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ బ్యాంకు రూ. 50 వేల కోట్ల టర్నోవర్ కలిగి ఉందన్నారు. ఉయ్యాలవాడ శాఖలో 6,805 మంది ఖాతాదారులున్నారని చెప్పారు. గత ఏడాది డిసెంబర్ నాటికి రూ. 75 కోట్లు లావాదేవీలు జరిపిందన్నారు. అలాగే రూ. 27 కోట్లు డిపాజిట్లు, పంట రుణాల కింద రైతులకు రూ. 49 కోట్లు అందజేశామన్నారు. అయితే, ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, మాజీ గ్రామ సర్పంచ్ పోచా రాధాకృష్ణారెడ్డి, కూడాల నారాయణరెడ్డి, మహానంది మేనేజర్ హరీష్‌కుమార్, ఉయ్యాలవాడ మేనేజర్ హరీష్, సిబ్బంది అధిక సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనరల్ మేనేజర్



ఆసుపత్రి ఆవరణలో ఉన్న ఆటోలు

పెద్దాసుపత్రా.. ఆటోస్టాండా!

గోస్పాడు: నంద్యాల పట్టణంలోని జిల్లా సర్వజన ఆసుపత్రి ఆటో స్టాండ్‌గా మారింది. గతంలో రహదారి వెంట వెళ్లే ఆటోలు పెద్దాసుపత్రి ముందు ప్రయాణికుల కోసం వేచి ఉండేవి. ప్రస్తుతం ఆటోలు ఆసుపత్రిలోకి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకునేందుకు బారులుగా నిలబెడుతున్నారు. ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద నిలిచిన ఆటోలతోనే ఇబ్బందులు ఎదురవుతుండగా.. లోపల కూడా బారులు తీరి, అడ్డదిడ్డంగా వస్తుండటంతో ఆసుపత్రికి వచ్చే వారికి, వైద్యులు, సిబ్బంది వాహనాల రాకపోకలకు ఆటంకంగా మారుతోంది. ఒక్కోసారి 108, ప్రత్యేక అంబులెన్స్‌ల రాకపోకలకు ఆటోలు ఆటంకంగా మారుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదు.



తుది దశకు కంప్యూటరైజేషన్

శిరివెళ్ల: వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాల్లో కంప్యూటరైజేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకుందని కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ రేణుకాదేవి సోమవారం తెలిపారు. రైతుల సమాచారం, రుణాలు, చెల్లింపు, సంఘం లావాదేవీల సమాచారం ఆన్‌లైన్ అవుతోందన్నారు. అలాగే బ్యాంక్ కొత్తగా సహకార వాత్సల్య డిపాజిట్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. 222, 555 రోజులకు డిపాజిట్ చేసిన వారికి అధిక వడ్డీ లభిస్తుందని తెలిపారు. 222 రోజుల కాల పరిమితితో చేసే సీనియర్ సిటిజన్లకు రూ. 7.70 శాతం వడ్డీ, 60 ఏళ్లలోపు వారికి 7.10 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. 555 రోజుల కాలపరిమితితో డిపాజిట్ చేసే సీనియర్ సిటిజన్లకు 9 శాతం వడ్డీ, ఇతరులకు 8.40 శాతం లభిస్తుందన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు పథకం అమల్లో ఉంటుందన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు రూ. 50 లక్షల డిపాజిట్లు సేకరించామని వెల్లడించారు. బ్రాంచ్‌లో లాకర్ సౌకర్యం ఉందన్నారు. రైతులకు వివిధ రకాల రుణాలు ఇస్తున్నామని తెలిపారు. 10 శాతం వడ్డీతో రూ. 20 లక్షల వరకు బంగారు రుణాలు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు.

రహదారి సమస్యకు పరిష్కారం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోనున్న హిందూ శ్మశాన వాటిక రహదారి సమస్యకు పరిష్కారం లభించిందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికకు వెళ్లే రహదారిలో వైకుంఠ రథం వెళ్లడానికి మార్గమధ్యంలో కాలనీ వాసులు ఆటోలు, సైకిళ్లు, అనధికార కట్టడాలు తదితర అడ్డంకులుండేవి. అలాగే వైకుంఠ రథం శ్మశాన వాటిక లోపలికి వెళ్లనివ్వకుండా ఘర్షణ నెలకొనేది. దీంతో సమస్య న్యాయస్థానం వరకు వెళ్లింది, బైటిపేట ఏరియాలో ఇళ్ల స్థలాలు లేవని, తహసీల్దార్ ఆర్‌టీ ఐ యాక్టు ద్వారా సమాచారం సేకరించారని, అనధికారికంగా ఇళ్లు కట్టుకొని సమస్యలు సృష్టిస్తున్నారని చెప్పారు. వైకుంఠ రథం పోవడానికి 18అడుగుల రోడ్డు ఇచ్చేందుకు, అడ్డంకు లు కల్పించమని, సహకరిస్తామని బైటిపేట ప్ర జలు స్వచ్ఛందంగా పరిష్కరించుకున్నారని చెప్పారు. చిన్నయ్య, కొశెట్టి కృష్ణమూర్తి, మద్ద య్య, భీముడు, ఏసేబు, జానీ, నరసింహ, వన్‌టౌన్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విచారణకు 54 దివ్యాంగ పింఛన్లు

శిరివెళ్ల: మండలంలో వంద శాతం వైకల్యం ఉన్న 54 పింఛన్లు విచారణకు వచ్చాయి. పూర్తిగా మంచానికి లేదా వీల్ చైర్‌కు పరిమితమైన వారికి ప్రభుత్వం రూ. 15 వేల పింఛన్ ఇస్తోంది. వాటిలో ఏమైనా బోగస్ ఉన్నాయా అని ప్రభుత్వం విచారణ, పరిశీలన కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. మండల కేంద్రం శిరివెళ్లలో 9 పింఛన్లు, గోవిందపల్లె 14, యర్రగుంట్ల 10, బోయలకుంట్ల 3, చెన్నూరు 4, గుంప్రమాన్‌దిన్నె 5, గుండంపాడు 5, కోటపాడు 5 పింఛన్లు ఉన్నాయి. మహదేవపురం ఇరువురు ప్రతి నెలా రూ. 15 వేలు పింఛన్ తీసుకుంటున్నారు. మొదటి దశలో వంద శాతం వికలత్వం ఉన్న వారిని, రెండో దశలో 40 పై శాతం ఉన్న వారిని విచారణ చేయనున్నారు. మండలంలో సాధారణ వికలాంగులు 3,500 మంది ప్రతి నెలా రూ. 6 వేల పింఛన్ తీసుకుంటున్నారు.

అహంకారంతో చేటు

నంద్యాల(వ్యవసాయం): అహంకారం మనిషికి చేటు కలిగిస్తుందని, భక్తితో మెలిగితే భగవంతుడి కృపకు పాత్రులవుతారని, తిరుప్పావై పాశురాలను విన్నవారికి జన్మజన్మల పుణ్యం లభిస్తుందని తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. సోమవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని 22వ పాశురాన్ని భక్తులకు వినిపించారు.



పాశురం వినిపిస్తున్న హయగ్రీవాచార్యులు

క్యాలెండర్ల ఆవిష్కరణ

గోస్పాడు: పీఆర్‌టీయూ, ఏపీ క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యూనియన్ క్యాలెండర్లను సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తహసీల్దార్ షేక్‌మొహిద్దీన్, ఎంపీడీఓ అమానుల్లా, ఎంఈఓ అబ్దుల్‌కరీం, ఈఓఆర్‌డీ నాగఅనసూయ, సీఆర్పీలు వెంకటేశ్వర్లు, రాముడు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

నీలకంఠుడి ఆలయ పనులకు మోక్షమెన్నడు?



పునాదుల స్థాయిలో నిలిచిపోయిన ఆలయ జీర్ణోద్ధరణ పనులు

- ఆలయ జీర్ణోద్ధరణ పనులకు గత ప్రభుత్వం రూ.72 లక్షల విడుదల
- ఆలయం తరఫున రూ.16లక్షలు అందజేత
- 2023లో పనులు ప్రారంభం
- కూటమి ప్రభుత్వం రాకతో నిలిచిన నిర్మాణం

నంద్యాల(అర్బన్): శ్రీకృష్ణ దేవరాయుల కాలంలో అయ్యలూరు గ్రామంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం నిర్మించారు.నాడు ఓ వెలుగు వెలిగిన ఆలయం శిథిలావస్థకు చేరింది. గోడలు కూలి ఆలయంలోకి వర్షపునీరు వస్తుండటంతో పూజా కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురయ్యేవి. ఆలయాని 70 ఎకరాల మాన్యం ఉండగా అందుకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షలు వేలం పాట ద్వారా దేవదాయశాఖకు చేరుతుంది. ఆలయాన్ని పునరుద్ధరించాలంటూ అధికారులకు పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేకపోయింది.

శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి చొరవతో..

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు నిధులు మంజూరు చేయించాలంటూ గ్రామస్తులు 2023లో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు.ఆయన కృషితో సంబంధిత శాఖ ద్వారా రూ.72 లక్షలు మంజూరు అయ్యాయి. ఆలయం తరఫున రూ.16లక్షలు కలిపి మొత్తం రూ.88 లక్షలతో ఆలయ పునరుద్ధరణ పనులను శిల్పా రవి ప్రారంభించారు. అప్పటి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆలయానికి సంబంధించిన బేస్‌మట్టం, పునాదుల పనులు వేగంగా జరిగాయి. ఆలయం త్వరగా పూర్తవుతుందని, పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని అనుకున్న గ్రామస్తుల కలలు కల్లలయ్యాయి.



మాట్లాడుతున్న గ్రామస్తులు

నిలిచిన పనులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు పలు కారణాల వల్ల ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్‌కు గురి కావడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గ్రామస్తులు అధికారులను పలు మార్లు కలిసినా స్పందన కరువైంది. పనులు ఎందుకు నిలిచాయో తెలియక గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేడు ప్రారంభోత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటైన మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి ప్రారంభించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభోత్సవ ముహూర్తం నిర్ణయించారు. డీఆర్‌ఓ రామునాయక్, ఆర్‌డీఓ విశ్వనాథ్, పలు శాఖల అధికారులు హాజరయ్యే కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రామచంద్రారావుకు ఎఫ్ఏసీతో రూరల్ తహసీల్దార్‌గా నియమించనున్నట్లు సమాచారం.



ప్రారంభోత్సవానికి కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది